వరాళి - ఆదితాళం (ఖండగతి)

వెలయునీకల్యాణ - వేదిగా మతినుండి
కలికి జవ్వనపు యా - గము జేసెనతడు

మలయు నీనాభి హో - మపు గుండమునను
నెలకొన్న విరహాగ్ని - నిండాబోసి
పొలయు నీ నిట్టూ - ర్పుల విసరుచును
ఒలుకు జెమటల నా - హుతివోసె నతడు

కదిసి నీ నెన్నడిమి - గగనము నందు
పొదలిన యారుచే - పొగ నిండగా
మదిరాక్షి నీ మంచి - మానపు బసువు
నదనెఱిగి వేలిచె - నతివ నీకతడు

కాటుకకన్నుల నిన్ను - గడు నలయించి
బూటకముల చిటి - పొటి సిగ్గుల
గాటపు కరుణ వేం - కటగిరి విభుడు
కోటి హోమము సేసె - కూడి నిన్నతడు

ఇక (శ్రీవేంకటగిరి) నాయకుడు చేసిన కామయాగం. ఇదీ వైదికకర్మానుసారమే యజ్ఞద్రష్ట, ఉద్గాత అన్నమాచార్యులు. యాజి శ్రీవేంకటేశవిభుడు. యజ్ఞపశువు అల మేల్మంగ అనాఘ్రాత సుమత్వం. ఆమె సౌందర్య యౌవనానుభవమే యజ్ఞఫలం. హవిర్భా గాలు సర్వదేవతాస్వరూపులైన అలమేల్మంగా శ్రీవిభులకు చెలిసగంగా అతిశయించినవి. ఉద్గాత సంకీర్తనాచార్యులు అలమేల్మంగకు విన్నవిస్తున్నారు నిత్య కల్యాణ స్వరూపమైన నీమనస్సు కల్యాణవేదికగా, తనువు యజ్ఞవాటికగా నీవిభుడు జవ్వనపు జన్నము ఆడినా డమ్మా. నీ గంభీరనాభి అనే హోమగుండాన ఇన్నాళ్ల ఎడబాటుల నిప్పులు(విరహాగ్ని) నిం డించి రస శృంగారోర్ధ్వ తమైన నీ నిట్టూర్పుల గాలిచే (ఆ నిప్పుల మంటలను) విసరు తూ తదుష్ణ జాత ఘర్మాజ్యాన్ని ఆహుతి చేసినాడమ్మా తిరుమలేశుడు.

ఆకాశం వలె మిక్కిలి చిక్కిన నీ నడుమునడుమ యిటు పొదలిన రోమావళి అనే పొగ అలముకోగా (మరన మద ఘూర్ణిత నేత్రవై నీవున్నప్పుడు) నీ మంచి కన్యాత్వమనే పశువు అనువులను సమయమెరిగి హరించి యజ్ఞవిధి నిర్వహించినాడు.

కాటుక కన్నులతో నలరు నిన్ను మొగమోటపు మాటలతో, ప్రగల్భాలతో, ప్రథమ సమాగమపు చిరు సిగ్గుల నిన్ను గాఢమైన కృపతో శ్రీవేంకటపతి మిక్కిలిగా అలపు చెందించి, నిన్ను కంతుకేళి గలసి చౌశీతి రతి బందానుష్టానంగా పునః పునః కృతంగా కోటి హోమము, అఖండమైన హోమం ఆచరించాడు గదమ్మా అని ప్రథమ సమాగమపు సంభోగ శృంగారాన్ని వైదిక కర్మగా తీర్చిదిద్దినారు అన్నమాచార్యులు. సంభోగ శృంగారానికి ఉపకరణాలుండవు, 'క్రియాసిద్ధిః సత్వేభవతి మహతాం నోపకరణైః' అన్నది ప్రమాణంగా రత్యుపకరణాలన్నీ రతియజ్ఞోపకరణాలైనవి.

యజ్ఞంలో సామవేదతంత్రం నడిపేవాడు ఉద్గాత. సామవేదజం సంగీతం. సంగీతాంగం సంకీర్తనం. సంకీర్తనాచార్యులు తాము గనుక అన్నమయ్య ఈ శృంగార సంకీర్తనా యౌవన యాగద్రష్టా, ఉద్గాతా అయినారు.